
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



నేడు వరలక్ష్మీ వ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా నేడు వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. 8లో



రాఖీ సందడి షురూ..

అనుబంధాలకు ప్రతీక అయిన రాఖీ సందడి ప్రారంభమైంది. సోదరులకు రాఖీలు కట్టేందుకు అక్కా చెల్లెళ్లు చేరుకుంటున్నారు. 9లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 24°

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు రామాలయంలో వరలక్ష్మీ వ్రత వేడుకలు

రేపు హయగ్రీవ జయంతి

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో అభిషేకం, సాయంత్రం 4గంటలకు బేడా మండపంలో సామూహిక కుంకుమార్చన గావిస్తారు. శనివారం హయగ్రీవ జయంతి సందర్భంగా హయగ్రీవునికి ఉదయం ప్రత్యేక స్నపనం, తిరుమంజనం జరపనున్నారు. చిన్నారులకు పలక, బలపం, నోటు పుస్తకాలను అందిస్తారు. అదే రోజు మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం, సాయంత్రం హవనం నిర్వహించారు. కాగా పవిత్రోత్సవాల సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాలను ఆదివారం పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, పాలక మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, పౌర్ణమి సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మీబాయి



మాట్లాడుతున్న విజయలక్ష్మీబాయి

కొత్తగూడెంఅర్బన్ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, ఈ మేరకు ఉపాధ్యాయులు తగిన ప్రణాళిక రూపొందించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు, ఎస్‌ఐఈటీ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి అన్నారు. జూలూరుపాడు మండలంలోని కేజీబీవీని గురువారం ఆమె సందర్శించారు. ఆ తర్వాత కొత్తగూడెం జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, కేజీబీవీ ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. యూడైస్ ప్లస్, అపార్ జనరేషన్, విద్యార్థుల సామర్థ్యాల పెంపు తదితర అంశాల్లో జిల్లా ప్రగతిని విశ్లేషించాలని సూచించారు. పెండింగ్ పనుల వివరాలను ఈనెల 10వ తేదీలోగా నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని చెప్పారు. డీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యా వ్యవస్థను ముందుకు నడిపిస్తామని అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ఐదు పతకాలు



విజేతలతో అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనగామలో జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఐదు పతకాలు దక్కాయి. జిల్లాకు చెందిన 15 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా.. రెండు స్వర్ణ, రెండు కాంస్య, ఒక రజిత పతకాలు సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. విజేతలను డీవైఎస్‌ఓ ఎం. పరంధామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.సారంగపాణి, జాతీయ కోచ్ నాగపూరి రమేష్ అభినందించారు.

సింగరేణి ఓపెన్ కాస్ట్ గని వద్ద పెంచిన చెట్లు (ఇన్‌సెట్) జామాయిల్ చెట్లు



అడవిలో అక్రమాలు!

భారీ స్థాయిలో వనాలు పెంచుతున్న సింగరేణి

- గనుల్లో సపోర్ట్ కోసం దుంగల వినియోగం
- మిగులు కలప అమ్మకం ద్వారా ఆదాయం
- ఫారెస్ట్ విభాగం రికార్డుల్లో అవకతవకలు
- 'విజిల్ బ్లోయర్' ద్వారా విషయం వెలుగులోకి..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అంతర్గత లోపాలను సవరించుకునే దిశగా సింగరేణి సంస్థ అడుగులు వేస్తోంది. ఇప్పటికే కారుణ్య నియామకాల విషయంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై వేగంగా విచారణ చేపడుతోంది. ఇప్పుడు అటవీ విభాగంలోనూ లోపాలు ఉన్నట్టుగా విజిలెన్స్ దృష్టికి వచ్చింది. దీంతో ఇక్కడ జరిగిన అవకతవకల పని పట్టే ప్రక్రియ ప్రారంభమైంది.

ష్..గప్ చుప్

ప్రతీ ఏరియాలో యూకలిప్టస్ (జామాయిల్) చెట్లను వందల ఎకరాల్లో సింగరేణి సంస్థ పెంచుతోంది. ఏపుగా పెరిగిన చెట్లను సంస్థ అవసరాల కోసం నరికి దుంగలుగా చేయిస్తుంది. ఈ పనులను టెండర్ల ద్వారా ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తోంది. పనులు దక్కించుకున్న సదరు సంస్థ.. నిర్ణీత విస్తీర్ణంలోనే చెట్లను నరకాల్సి ఉంటుంది. అయితే చాలా సందర్భాల్లో పరిమితికి మించి విస్తీర్ణంలో చెట్లు కొట్టడం, అదనంగా కొట్టిన చెట్లను రికార్డుల్లో చూపకపోవడం పరిపాటిగా మారింది. మరోవైపు నరికిన చెట్ల ద్వారా గనుల్లో సపోర్టింగ్‌కు పనికి వచ్చే దుంగలు పోను మిగిలే ఇతర కలపను సైతం పక్కదారి పట్టిస్తున్నారు. అటవీ విభాగంలో పని చేసే ఉద్యోగులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కవడంతో ఈ వ్యవహారం ఏళ్ల తరబడి సాఫీగా సాగిపోతూ వచ్చింది.

నాలుగేళ్ల తర్వాత..

అటవీ విభాగంలో 2018 నుంచి 2020 వరకు నరికిన చెట్లు, మిగులు కలప అమ్మకం విషయంలో రూ.కోట్లలో తేడా ఉందంటూ ఈ ఏడాది ఆరంభంలో విజిల్ బ్లోయర్ ద్వారా సింగరేణి విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు వెళ్లాయి. వెంటనే రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు ఆరా తీయగా, చెట్ల నరికివేత పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లలో కొందరు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నట్టుగా తేలింది. ఒక ఏరియాలోనే సుమారు రూ.50 లక్షలకు పైగా సంస్థకు రావాల్సిన నిధుల్లో గోల్‌మాల్ జరిగినట్టుగా ప్రాథమిక విచారణలో తేలింది. చెట్ల నరికివేత, కలప అప్పగింత, మిగులు అమ్మకం వంటి కీలక విషయాలకు సంబంధించిన వివరాల నమోదులో అవకతవకలు జరిగాయని గుర్తించినట్టు తెలుస్తోంది. దీనిపై లోతుగా ఆరా తీయగా సంబంధిత విభాగం పనులు పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు రంగంలోకి దిగి, ఆ సంస్థ నుంచి రూ.50 లక్షలు సెటిల్‌మెంట్ చేయించేందుకు ఒప్పించినట్టు తెలుస్తోంది.

ఎవరూ చూడకుంటే..

రూ.వేల కోట్ల టర్నోవర్ కలిగిన సింగరేణి సంస్థలో 40 వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. సంస్థకు అంతర్గత ఆడిట్, నిఘా, విజిలెన్స్ విభాగాలూ ఉన్నాయి. అయినప్పటికీ రూ.50 లక్షలకు పైగా బకాయిలు లెక్కల్లోకి రాకుండా పోవడం, దాదాపు ఐదేళ్లు కావస్తున్నా ఈ పొరపాటును ఎవరూ గుర్తించకపోవడం సందేహాలకు తావిస్తోంది. విజిల్ బ్లోయర్లు రంగంలోకి దిగకుంటే ఆ రూ.50 లక్షలు సంస్థ ఖాతాలోకి రాకుండా పక్కదారి పట్టేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనవరిలో ఈ విషయం బయటకు వచ్చినా ఇప్పటి వరకు విచారణ పేరుతో ఈ ఫైల్‌ను తొక్కి పెడుతున్నారని, తుది నివేదికను బయటకు వెల్లడించడం, పొరపాటుకు కారణమైన అధికారులు/ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని, జరిగిన పొరపాటును సెటిల్‌మెంట్ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సింగరేణి విజిలెన్స్ జనరల్ మేనేజర్ ప్రసాదరావు వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

గనుల్లో అడవులు..

దేశ వ్యాప్తంగా సింగరేణి అంటే బొగ్గు తవ్వకాలు చేపట్టే మైనింగ్ సంస్థగానే తెలుసు. కానీ బొగ్గు తవ్వకాలతో పాటు ఇటీవల థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ దూసుకుపోతోంది. రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌పైనా దృష్టి పెట్టింది. మైనింగ్‌తో వాటిల్లే పర్యావరణ నష్టాల నివారణకు భారీ ఎత్తున మొక్కలు నాటుతోంది. అంతేకాక భూగర్భ గనుల్లో బొగ్గు వెలికి తీసినప్పుడు ఆ ప్రాంతంలో ఖాళీ ఏర్పడి కుంగుబాటుకు గురికాకుండా సపోర్ట్‌గా కలప దిమ్మెలను నిలపాల్సి ఉంటుంది. దీంతో ఒకవైపు సంస్థ అవసరాలు, మరోవైపు సామాజిక బాధ్యతగా సంస్థ భారీ ఎత్తున ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. అందుకే ప్రత్యేకంగా అటవీ విభాగాన్ని ఏర్పాటు చేసింది.

మునగ సాగులో ముందంజ



ఢిల్లీలో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- ఆదాయాభివృద్ధిలో మోడల్‌గా జిల్లా..
- ఢిల్లీ సెమినార్‌లో కలెక్టర్ వెల్లడి
- రైతు జమీల్ సక్సెస్ స్టోరీని వివరించిన పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మునగ సాగు ద్వారా ఆదాయాభివృద్ధిలో భద్రాద్రి జిల్లాను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం 'ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్'పై జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహించారు. దీనికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మునగసాగుపై వివరించారు. తెలంగాణలో పెద్దదైన జిల్లా.. 50 శాతం అడవులతో నిండి ఉందని, 37 శాతం గిరిజన జనాభా ఉందని తెలిపారు. వివిధ పంటలు సాగు చేస్తున్నప్పటికీ తక్కువ ఆదాయం పొందుతున్నారని, పత్తికి సగటున ఎకరాకు రూ.15 వేలు, మొక్కజొన్నకు రూ. 30వేలు మాత్రమే లాభం వస్తోందని వివరించారు. రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో టీఎన్ఏయూ(కోయంబత్తూర్), జిల్లాలోని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల నిపుణులతో మునగసాగు, లాభాలపై కరపత్రాల ద్వారా అవగాహన పెంచామని, ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఖర్చు లేకుండా మునగ సాగు ప్రారంభించామని చెప్పారు. ఎకరానికి 1000 మొక్కలుంటాయని, కనీసం ఒక్కో చెట్టుకు 100 కాయల దిగుబడి వచ్చినా..రూ. 2కు కాయ చొప్పు రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చని, ఆకుల విక్రయంతో అదనంగా రూ. 20వేలు లాభం వస్తుందని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 415 ఎకరాల్లో మునగ సాగవుతోందని, 100 ఎకరాల్లో ప్రధాన పంటగా, 315 ఎకరాల్లో అంతరపంటగా సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన రైతు జమీల్ మునగ ఆకులతో కోళ్లకు మేతవేసి అదనపు ఆదాయం పొందారని, ప్రస్తుతం కౌజు పిట్టల యూనిట్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారని వివరించారు. రైతుల అనుమానాలను తొలగించి, గ్రామీణ స్థాయిలో విజేతల అనుభవాలను పంచుకోవడం ద్వారా రైతులు ప్రయోగాత్మకంగా ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. కాగా, సెమినార్‌లో పాల్గొన్న కేంద్రస్థాయి అధికారులు, ఇతర జిల్లాల కలెక్టర్లు ఇక్కడి మునగసాగును అభినందించారు.

అమాయకులను హతమారుస్తున్నారు..

ఆదివాసీ హక్కుల పోరాట వేదిక కన్వీనర్ గడ్డం లక్ష్మణ్



మాట్లాడుతున్న గడ్డం లక్ష్మణ్, పక్కన నాయకులు

ఇల్లెందు : ఛత్తీస్‌గఢ్‌లో ఆరు నెలలుగా మారణహోమం సాగుతోందని, పోలీసులు, కేంద్ర బలగాలు మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసీలను హతమార్చారని ఆదివాసీ హక్కుల పోరాట వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, కో కన్వీనర్ ఎన్.నారాయణరావు అన్నారు. ఇల్లెందులో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మొత్తం 650 మందిని హత్య చేయగా అందులో 450 మంది ఆదివాసీలే ఉన్నారని తెలిపారు. ఇంకా లెక్కలోకి రాని మరెంతో మందిని పోలీసులే ఖననం చేశారని ఆరోపించారు. ఆదివాసీ మహిళలపై హత్యలు, అత్యాచారాలు నిలిపేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 9వ తేదీన హైదరాబాద్‌లో, ఈనెల 24న వరంగల్‌లో, అక్టోబర్ 5న ఇల్లెందులో పలువురు మేధావులతో సభలు నిర్వహిస్తామని వివరించారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని, వనరుల దోపిడీని అరికట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక నేతలు బాలయ్య, చంద్రమౌళి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ముక్తి సత్యం, మెంతన సంజీవరావు, గుంపిడి వెంకటేశ్వర్లు, సూర్ణపాక సత్యనారాయణ, వట్టం కన్నయ్య, కె.గీతారెడ్డి, దుర్గారావు, వీరభద్రం, ఎట్టి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్దీపనం'తో నైపుణ్యాలు మెరుగుపడాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



గర్భిణులకు వస్త్రాలు అందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయిలో నైపుణ్యాలను పెంచేందుకు రూపొందించిన ఉద్దీపనం మెటీరియల్‌కు సాధికారత లభించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో పీజీహెచ్‌ఎం, హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు, హాస్టళ్లలో అమలవుతున్న మెనూ, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్దీపనం మెటీరియల్‌తో సత్ఫలితాలు వచ్చాయని, వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్‌లో ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తామని, ఈ లోగా విద్యార్థులకు వర్క్ బుక్‌పై పూర్తి స్థాయిలో అవగాహన రావాలని అన్నారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమష్టిగా పని చేయాలని సూచించారు. సెప్టెంబర్ నుంచి ప్రతి ఇనిస్టిట్యూట్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు తీసుకునేలా యాప్‌ను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమేష్, ఏటీడీఓలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఓకు బ్రహ్మకుమారీ రాఖీ..

ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మాతలు ఐటీడీఏ పీఓకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సంస్థ చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణవేణి, భావన తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన వెంటనే పాలు ఇచ్చేలా ప్రతీ తల్లికి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పీఓ రాహుల్ అన్నారు. సబ్ కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో వారు మాట్లాడుతూ.. పుట్టిన గంటకే తల్లిపాలు అందేలా వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కనీసం ఆరు నెలల వరకు తల్లి పాలు ఇప్పించేలా చూడాలన్నారు. అనంతరం గర్భిణులకు బాలామృతం అందజేయగా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్లు అనసూయ, చంద్రకళ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయండి

డీఐఈఓ వెంకటేశ్వరరావు



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

బూర్గంపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖా అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలన్నారు. నీట్, జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటి సీట్లు సాధించేలా ప్రత్యేక శిక్షణ తీసుకోవాలన్నారు. విద్యార్థుల యూడైస్, అపార్‌లలో తప్పులుంటే సరిచేయాలన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని అధ్యాపకులను ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ చీన్యా, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్షరాస్యతా ఉద్యమమే 'ఉల్లాస్'

డీఈఓ నాగలక్ష్మి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈఓ, అధికారులు

కొత్తగూడెంఅర్బన్ : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ఉద్దేశమని డీఈఓ నాగలక్ష్మి తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. 'అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ(ఉల్లాస్) అనేది సమాజ సమగ్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. నిరక్షరాస్యత నిర్మూలనతో పాటు వ్యక్తుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, సమాజాన్ని సమానత్వ బాటలో నడిపించే శక్తివంతమైన సాధనం అని వివరించారు. వయోజన విద్య డీడీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణలో పొందిన జ్ఞానాన్ని మండల స్థాయిలో అమలు చేసి, ప్రతి నిరక్షరాస్యుడిని అక్షర్యాస్యులుగా మార్చాలని అన్నారు. కోర్సు కో ఆర్డినేటర్ ఎస్‌కే సైదులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని క్రియాశీలంగా అమలు చేయడమే లక్ష్యమని, ప్రతి ఎమ్మార్పీ.. వారి పరిధిలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణకు సంబంధించిన ఉల్లాస్ బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కో - ఆర్డినేటర్లు సతీష్‌కుమార్, ఎ.నాగరాజశేఖర్, జె.అన్నామణి, పాపారావు, అరుంధతి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 80 మంది ఎంపిక

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 80 మంది ఎంపికయ్యారు. వివిధ కంపెనీల్లో నియామకాలకు నిర్వహించిన జాబ్‌మేళాలో 132 మంది పాల్గొన్నారు. వీరి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 80 మందిని ఎంపిక చేశారని, శిక్షణ అనంతరం అర్హులకు ఉపాధి కల్పిస్తారని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

కిన్నెరసాని ప్రాజెక్టు గేటు ఎత్తివేత

4 వేల క్యూసెక్కుల నీటి విడుదల

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద నీరు చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 500 క్యూసెక్కుల నీరు రావడంతో గురువారం రాత్రికి నీటి మట్టం 405 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేటు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

యానంబైలులో కేంద్ర బృందం పరిశీలన



జీపీలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న సభ్యులు

పాల్వంచరూరల్ : గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు కె.జయంత్,ఎస్.రవిచంద్ర సూచించారు. మండలంలోని పాయకారి యానంబైల్ గ్రామంలో గురువారం వారు పర్యటించారు. గ్రామంలో నిర్మించిన ఇంకుడుగుంతలను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగం, నీటి సంరక్షణ చర్యలపై ఆరా తీశారు. వారి వెంట ఎంపీడీఓ కె.విజయభాస్కర రెడ్డి, ఎస్‌బీఎం కన్సల్టెంట్ రేవతి, ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీఓ పోరండ్ల రంగా, టీఏ సైదులు, కార్యదర్శులు మధు, శ్రీనివాస్, బాబురావు, దేవ్‌సింగ్, బాబా ఉన్నారు.

పనులు సాగేదెలా ?

- ఆలయ మాస్టర్ ప్లాన్, గోదావరి పుష్కరాలే కీలకం
- ప్రస్తుత ఈఓ బదిలీ, ఇంకా ఎవరినీ నియమించని ప్రభుత్వం
- సీనియర్ అధికారిని కేటాయించాలంటున్న భక్తులు



మాస్టర్ ప్లాన్‌లో రూపొందించిన ఆలయ నమూనా

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా మాఢ వీధుల విస్తరణ జరుగుతోంది. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనుండగా వీటికి సంబంధించి ముందస్తు ప్రణాళిక సిద్ధం కావాల్సి ఉంది. మాస్టర్‌ప్లాన్ పనులు సైతం చేపట్లాల్సి ఉన్న ఈ తరుణంలో ఆలయ ఈవో ఎల్.రమాదేవికి బదిలీ కావడం, ఈ పోస్టులో ప్రభుత్వం ఇప్పటివరకు ఏ అధికారినీ నియమించకపోవడంతో పనులు సాగేదెలా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి కీలక తరుణంలో ఈఓగా సీనియర్ అధికారిని లేదా ఐఏఎస్‌ను నియమించాలని కోరుతున్నారు.

మాఢ వీధులకు నిధులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆలయ అభివృద్ధి పనులు చేపడుతోంది. తొలి ఘట్టమైన మాఢ వీధుల విసర్జణకు నిధులు కేటాయించింది. దీంతో ఆలయానికి మూడు వైపులా ఉన్న ఇళ్లను తొలగించిన రెవెన్యూ అధికారులు.. భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. శిథిలాల తొలగింపు అనంతరం ఆ భూమిని దేవస్థానం అధికారులకు అప్పగించనున్నారు. ఆ తర్వాత రోడ్లు, ఇతర పనులు చేపడతారు. అయితే పనుల వేగవంతం, దేవస్థానం అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం, ఆ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం వంటి పనుల్లో ఆలయ కార్యనిర్వాహక అధికారే కీలక పాత్ర పోషిస్తారు. ఇక మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. పుణ్య స్నానాలకు కోటి మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రద్దీకి తగినట్టుగా ఆలయంలో దర్శన సౌలభ్యం, ఇతర వసతి, సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు, ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుంది. వీటన్నింటిలోనూ ఈఓనే కీలకం.

సీనియర్లయితేనే మేలు..

ప్రస్తుతం ఈఓగా విధులు నిర్వహిస్తున్న రమాదేవికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేశారు. దీంతో ఆలయ ఈఓ పోస్టు ఖాళీ కాగా, ఇంకా భర్తీ చేయలేదు. ఆలయ ఈఓ పోస్టును సీనియర్ అధికారి లేదా ఐఏఎస్ అధికారితో భర్తీ చేయాలని భక్తులు అంటున్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రం తెలంగాణాకే ప్రత్యేకమైన దేవస్థానం. ఇంతటి కీలక ఆలయాన్ని, వ్యవస్థను నిత్యం పర్యవేక్షించి పరిపాలనను గాడిలో పెట్టాలంటే సమర్థవంతమైన అధికారి అయితేనే సాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి



భద్రాచలం దివ్యక్షేత్రం దిన దినాభివృద్ధి చెందుతోంది. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. గత పుష్కరాల సమయంలోనే పనులు ఆలస్యం కావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ వైఫల్యాలను దృష్టిలో పెట్టుకుని ఈసారైనా ముందుస్తు చర్యలు చేపట్టాలి. అందుకు అనుభవం కలిగిన సీనియర్ అధికారి ఈఓగా ఉంటేనే మేలు.

– అడపా వాసు, భద్రాచలం

క్లుప్తంగా

10న మెగా ఉచిత ఆరోగ్య శిబిరం

కొత్తగూడెంఅర్బన్: హైదరాబాద్ కేర్ ఆస్పత్రుల ఆధ్వర్యాన గుండె సంబంధిత వ్యాధి నిపుణులు వి.సూర్యప్రకాశరావు నేతృత్వంలో ఈనెల 10వ తేదీన గుండె సంబంధిత ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని కొత్తగూడెంలో నిర్వహించనున్నారు. ఈ శిబిరం కేసీఓఏ క్లబ్‌లో జరుగుతుందని.. ఈసీజీ, టుడీ ఎకో, జీఆర్ బీఎస్, లిపిడ్ ప్రొఫైల్, బీపీ పరీక్షలు, కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే శిబిరంలో పరీక్షల కోసం శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం 95054 84389(మునీంద్రరెడ్డి), 88868 53111(నాగార్జున), 63049 25761(మోహిత్ సుభాష్) నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మీ సేవ కేంద్రాల్లో తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఇల్లెందు: పట్టణంలోని మీ సేవ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తనిఖీ చేశారు. పెండింగ్ దరఖాస్తులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు తీసుకోవాలని, ప్రజలకు సేవలు వేగవంతంగా అందజేయాలని సూచించారు. సూచిక బోర్డులు, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీ సేవ కేంద్రాల జిల్లా మేనేజర్ సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు ఎల్.నాగేశ్వరరావును ఉన్నతాధికారులు గురువారం విధుల నుంచి తొలగించారు. ఏకలవ్య పాఠశాల కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ ఆరో తరగతి విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా, విద్యార్థిని తల్లి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్‌సీఓ అరుణకుమారి బుధవారం విచారణ నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో గురుకులాల కార్యదర్శి సీతామహాలక్ష్మి ఆదేశాలతో ఐటీడీఏ పీఓ రాహుల్ సదరు ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించినట్లు ఆర్‌సీఓ తెలిపారు. కాగా సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేయాలని గిరిజనులు మల్లు దొర, కారం గోపాల్, కనితి జంపన్న, రామకృష్ణ తదితరులు కోరారు.

పోడు రైతు రిమాండ్

పాల్వంచరూరల్: పోడు కొట్టిన కేసులో కోర్టుకు హాజరుకాని రైతుకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. వైల్డ్‌లైఫ్ సెక్షన్ ఆఫీసర్ కిషన్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని మొండికట్ట గ్రామానికి చెందిన రైతు అలకుంట రమేష్ అక్రమంగా పోడు సాగు చేసినట్లు 2024 మే నెలలో యానంబైల్ రేంజ్ వైల్డ్‌లైఫ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో కోర్టుకు హాజరుకానందున, కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. గురువారం 14 రోజుల రిమాండ్ విధించగా, భద్రాచలం సబ్ జైలుకు పంపించినట్లు సెక్షన్ ఆఫీసర్ తెలిపారు.

చోరీపై విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట గ్రామానికి చెందిన సోయం రామిశెట్టి ఇంట్లో జరిగిన చోరీ కేసుపై విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ గణేష్ గురువారం తెలిపారు. ఈ నెల 6న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించారని పేర్కొన్నారు. మూడు ఇనుప బీరువాలను పగులగొట్టి బంగారం, నగదు.. మొత్తం రూ.3,53,000 విలువైన సొత్తు చోరీ చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

ఇస్తినమ్మ వాయినం!

నేడు వరలక్ష్మీ వ్రతం జరుపుకోనున్న మహిళలు

- లక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం
- ఆలయాలు, ఇళ్లలో పూజలకు ఏర్పాట్లు



కొత్తగూడెం సూపర్‌బజార్‌లో విక్రయానికి సిద్ధంగా పూలు

కొత్తగూడెంటౌన్: శ్రావణమాసంలో తలపెట్టిన పనులకు లక్ష్మీదేవి ఆశీర్వాదం ఉంటుందని, వరలక్ష్మీవ్రతం ఆచరిస్తే సకల సౌభాగ్యాలు, సంపదలు చేకూరుతాయని మహిళలు విశ్వసిస్తారు. నేడు శ్రావణ శుక్రవారం సందర్భంగా మగువలు వ్రతం ఆచరించనున్నారు. మహిళలు అత్యంత ఇష్టంగా జరుపుకునే పండుగ ఇది. వ్రతం రోజు లక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు సంపద, భూమి, శిక్షణ, ప్రేమ కీర్తి, శాంతి, సంతోషం, శక్తి సిద్ధిస్తాయని వేద పండితులు, అర్చకులు పేర్కొంటున్నారు. వివాహితలు దీర్ఘ సుమంగళిగా ఉండాలని, యువతులు మంచి భర్త రావాలని వ్రతం ఆచరిస్తారు. ఆలయాలు, ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు వరలక్ష్మీవ్రతం జరుపుకోవడం ఆచారమని పురోహితులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఆలయాలు, ఇళ్లలో పూజలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

గారెలు, బూరెలతో నైవేద్యం

వ్రతం సందర్భంగా తొలుత అమ్మవారి చిత్రపటాల వద్ద ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు. పండ్లు, పూలు, గాజులతో అలంకరిస్తారు. అమ్మవారు మెచ్చే గారెలు, బూరెలు, పులిహోర, పూర్ణాలు, శెనగల ప్రసాదం నైవేద్యంగా పెడతారు. ఎరుపు, ఆకుపచ్చ, బంగారు వర్ణపు చీరలు ధరించి మహిళలు పూజలు చేస్తారు. కొందరు అమ్మవారికి చిత్రపటం ఎదుట కలశ స్థాపన చేస్తారు. కోరిన కోర్కెలు నెరవేరాలని, కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని మహిళలు వ్రతం ఆచరిస్తారు. వ్రతం అనంతరం వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు.

మార్కెట్‌లో పూల సందడి

వరుస పండుగలు కావడంతో జిల్లా కేంద్రంలో గురువారం పూల సందడి నెలకొంది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో కొత్తగూడెం సూపర్ బజార్, రైతుబజార్, రామవరం, పాలకేంద్రం, రుద్రంపూర్, పాత కొత్తగూడెం, విద్యానగర్‌కాలనీ, పోస్టాఫీస్ ఏరియాలతో పాటు పలు ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. పూలు, స్వీట్లు, నూతన వస్త్రాల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. కిలో చామంతి రూ.800, దండ (చామంతి) రూ.300, లిల్లీ పూల దండ రూ.200, బంతిపూలు పావు కిలో ధర రూ.50, గనుగు పూలు రూ.15, తామర పువ్వు రూ. 15, తమలపాకులు కట్టా రూ.10, చామంతి ఆకు రూ.50, మల్లెపూలు మూర రూ.50, గుమ్మడి కాయ ధరలు రూ.200 నుంచి రూ. 350 వరకు, తంగేడు పూల కట్ట రూ.15, గులాబీ పూవు ఒక్కోటి రూ. 40, గోరింట పూలు చటాక్ రూ.40 వరకు పలికాయి. చామంతి పూలు మూర రూ.50, విరజాజి పూలు మూర రూ.50కు విక్రయించారు.



అమ్మవారు..

శుభాలు కలుగుతాయి



ఆడపడుచులకు ఎంతో ఇష్టమైన పండుగ వరలక్ష్మీవ్రతం. వ్రతం ఆచరిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సుఖసంతోషాలతో ఉంటారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతారు.

– నల్లాన్ చక్రవర్తుల క్రాంతికుమారాచార్యులు, అర్చకుడు, కొత్తగూడెం

పూలకు గిరాకీ బాగుంది



వరలక్ష్మీవ్రతం సందర్భంగా పూలకు గిరాకీ బాగుంది. విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి పూలు తెప్పించాం. కిలో చామంతి పూలు రూ.800కు విక్రయించాం. సాధారణ రోజు కంటే గురువారం వ్యాపారం ఎక్కువగా జరిగింది.

–ఎండీ మహమూద్, పూలవ్యాపారి, కొత్తగూడెం

కొబ్బరికాయ కొనలేం..

రూ.50 కి చేరిన టెంకాయ ధర

బూర్గంపాడు: శ్రావణం అంటేనే ఆధ్యాత్మిక మాసం. ఈ నెలలో పూజలు, వ్రతాలు ఎక్కువ. వీటికి కొబ్బరికాయలు, పూలు, పండ్లు తప్పకుండా ఉండాలి. అయితే ఈ ఏడాది కొబ్బరికాయల ధరలు భారీగా పెరిగాయి. చిన్నసైజు కాయ కూడా రూ. 50కి అమ్ముతున్నారు. ఏపీలో కొబ్బరి తోటల సాగు తగ్గడంతో ధరలకు రెక్కలు వచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కేరళ, తమిళనాడు నుంచి కొబ్బరికాయలు దిగుమతి చేసుకుంటుండగా రవాణా ఖర్చులు భారమవుతున్న నేపథ్యంలో ఇక్కడ ధరలు పెరిగాయి. మార్చిలో రూ. 25 ఉన్న కొబ్బరి కాయ ధర ప్రస్తుతం రెట్టింపైంది. వీటితో పాటు పూల ధరలూ నింగినంటుతున్నాయి. వర్షాలు లేక పూల దిగుబడి తగ్గగా.. ఇప్పుడు రూ.100 పెట్టినా గుప్పెడు పూలు రావడం లేదు. పండ్లు సైతం అదే దారిలో ఉన్నాయి. అయితే నేడు (శుక్రవారం) వరలక్ష్మీ వ్రతం కావడంతో ఎంత ధరయినా పెట్టి కొనుగోలు చేసేందుకు మహిళలు వెనుకాడడం లేదు.

మా కుటుంబాలకు అన్యాయం జరుగుతోంది..

మొగళ్లపల్లి భూమిపుత్ర సొసైటీ సభ్యుల ఆవేదన



అన్యాయం జరిగిందని చెబుతున్న సొసైటీ సభ్యులు

చర్ల: ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయిలో ఆధారాలు అందిస్తామని, విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని చర్ల మండలం మొగళ్లపల్లి భూమి పుత్ర సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం కొందరు సభ్యులు సమావేశమై తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. గోదావరి నదిలో చేపట్టిన ఇసుక క్వారీని తాము నిర్వహిస్తున్నామని, అయితే ఇసుక రీచ్ మంజూరుకు రైజింగ్ కాంట్రాక్టర్ రూ.కోట్లు ఖర్చు చేశాడంటూ సొసైటీ రికార్డులన్నీ ఆయన వద్దే ఉంచారని, దీనిపై తమ సొసైటీ అధ్యక్షురాలిని అడిగితే తమపైనే వాదనకు దిగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక క్వారీ రికార్డుల తనిఖీకి వచ్చిన అధికారులు.. పంచాయతీ కార్యాలయంలో కాకుండా కాంట్రాక్టర్ ఇంటి వద్ద రికార్డులు తనిఖీ చేయడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు సభ్యులమైన తమ కడుపు కొడుతున్నారని, ఈ విషయంలో అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. తామే ఇసుక క్వారీ నిర్వహించుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఇసుక అక్రమాలకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఇతర ఉన్నాతాధికారుల సమక్షంలో విచారణ చేపడితే అందిస్తామని తెలిపారు.

జామాయిల్ కలప మాయం



ప్లాంటేషన్‌లో నరికిన చెట్లు

ములకలపల్లి: తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో పెంచుతున్న ప్లాంటేషన్‌లో జామాయిల్ మొక్కలు మాయమయ్యాయి. రూ. రెండు లక్షలకుపైగా విలువైన కలప స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలపరిధిలోని రంగాపురం శివారులో ములకలపల్లి రేంజ్‌లో 2006లో జామాయిల్ ప్లాంటేషన్ వేశారు. 60.5 హెక్టార్ల పరిధిలో లక్ష మొక్కలకు పైగా నాటారు. ఇప్పటికే రెండు దఫాలుగా కటింగ్ చేయగా, కలప మూడో కటింగ్‌కు సిద్ధంగా ఉంది. వచ్చే ఏడాది వీటిని విక్రయించనున్నారు. ఈ తరుణంలో కొంత కలప మాయం చేశారు. ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేందుకు చెట్టుకు ఒక కొమ్మ నరికి రెండో కొమ్మను వదిలేశారు. అయితే ఇది ఇంటి దొంగల పనేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారం రోజుల క్రితం సుమారు 500 పైచిలుకు చెట్లను నరికి, గత గురువారం బయటకు తరలించినట్లు తెలుస్తోంది. సుమారు నాలుగు ట్రాక్టర్ల మేర కలప స్వాహా చేసినట్లు సమాచారం. సంబంధిత శాఖ అధికారులు మాత్రం కొంత కర్రను ములకలపల్లిలోని ఓ ప్రైవేటు అడితీలో స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ డిపోకు తరలించారు. కానీ కలప విక్రయించిన, కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేయలేదు. విషయం బయటకు పొక్కుతున్న క్రమంలో కొద్దిపాటి కలపను పట్టుకుని చేతులు దులుపుకుంటున్నారే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రంగా జరిమానా విధించి, ఒక్క వ్యక్తిపైనే కేసు నమోదు చేసి తమ వారిని ఒడ్డున వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అక్రమంగా కలప తరలింపై వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ప్లాంటేషన్ మేనేజర్ సునీతను వివరణ కోరగా... 500 మొక్కలు నరికినట్లు గుర్తించామని, ఒకరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. రూ.65 వేల జరిమానా విధించామని, సమగ్ర విచారణ సాగుతోందని వివరించారు.

■ ఆ దాడులు పాశవికం..

గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న పాశవిక దాడులను అన్ని వర్గాల ప్రజలూ ఖండించాలని, శాంతి నెలకొల్పేందుకు దేశాధినేతలు కృషి చేయాలని పలువురు నినదించారు. ఖమ్మంలో గురువారం పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీలు, సంఘాల నాయకులు, యువజనులు, విద్యార్థులు, న్యాయవాదులు, వైద్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెవిలియన్ మైదానం నుంచి మయూరిసెంటర్, వైరా రోడ్డు మీదుగా జెడ్పీ సెంటర్ వరకు ప్రదర్శనగా సాగారు. పాలస్తీనా ప్రజలకు ఆహారం, నీరు అందకుండా వేలాదిమంది ఆకలి చావులకు కారణమవుతున్న ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ అక్కడి ప్రజల దీనస్థితిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. –ఖమ్మం మయూరిసెంటర్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్) గాజాలో చిన్నారుల దీనస్థితిని ప్రదర్శిస్తున్న దృశ్యం

ఇల్లెందులో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- మంచినీటి చెరువుకు అలుగు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బీడీ కాలనీ, దర్గా వెనక ప్రాంతంలో వరదనీరు ఇళ్లలోకి చేరింది. బీడీకాలనీలో ఆరుబయట గూళ్లలో పదుల సంఖ్యలో ఉన్న కోళ్లు నీట మునిగి మృతి చెందాయి. రహదారులు దెబ్బతిన్నాయి. ఇంటి మెట్లు కూలిపోయాయి. వరదనీటితోపాటు పాములు సైతం కొట్టుకుని రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారే వరకు నీటి ప్రవాహం కొనసాగడంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ ఉండిపోయారు. ఇక ఇల్లెందు తాగునీటి చెరువు అలుగు పోసింది. దీంతో పట్టణ ప్రజలు ఆనందంతో అలుగులో జలకాలాటలు ఆడారు.



అలుగు పోస్తున్న తాగునీటి చెరువు



బీడీకాలనీలోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన వరదనీరు

సీపీఐ నేత అయోధ్యకు కన్నీటి వీడ్కోలు

మృతదేహం వద్ద నివాళులర్పించిన ప్రముఖులు

మణుగూరు టౌన్: పేదల పక్షపాతి, ప్రజా గొంతుక బొల్లోజు అయోధ్యకు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, గురువారం స్వగ్రామం రామానుజవరంలో అంత్యక్రియలు జరిపారు. సంతాప సభ నిర్వహించగా, పలువురు హాజరై నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక నిర్బంధాలు ఎదుర్కొని ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. అయోధ్య మృతి పార్టీకి, పినపాక నియోజకవర్గానికి తీరని లోటని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కన్నీటి వీడ్కోలు

రామానుజవరంలో భౌతికకాయాన్ని ఉంచగా అన్ని సంఘాల, పార్టీల నాయకులు, యూనియన్ల నేతలు, భవన, రోడ్డు, లారీ, బొగ్గుముఠా, బార్ షాప్ వర్కర్లు, అసంఘటిత రంగ, సంఘటిత రంగ కార్మిక నాయకులు తరలివచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు.

నేటితో ముగియనున్న అప్రెంటిస్ దరఖాస్తు గడువు

సింగరేణి(కొత్తగూడెం): డిప్లొమా, ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులు అప్రెంటిస్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారంతో గడువు ముగియనుందని సింగరేణి జీఎం(హెచ్‌ఆర్‌డీ) వెంకట్రాంరెడ్డి తెలిపారు. అప్రెంటిస్ షిప్‌నకు 525 సీట్లు ఉండగా, 1,100 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. అర్హులు ఉంటే సింగరేణి లేదా ఇతర సంస్థల్లో అప్రెంటిస్ షిప్ కోసం www. nats. education. gov. in (i.eNATS2.0) www. scclmines. com/ apprenticeship లో దరఖాస్తు చేసుకుని కాపీలను సమీపంలోని ఎంవీటీసీలో ఈ నెల 11వరకు అందజేయాలని సూచించారు. కాగా, సర్వర్ సమస్య ఎదురవుతున్నందున దరఖాస్తు గడువు పెంచాలని మైనార్టీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డీ.యాకూబ్ పాషా ఓ ప్రకటనలో కోరారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఓ వ్యక్తి పరారయ్యాడు. రూ.2,800 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి



మహేష్ మృతదేహం

అశ్వారావుపేటరూరల్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కేశప్పగూడేనికి చెందిన సోడెం మహేష్(29), అతని తమ్ముడు ముత్యాలరావు, మరికొందరు కలిసి ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువులో చేపలు వేటకు వెళ్లారు. ఈ క్రమంలోనే మహేష్ చెరువులో దిగి వల విసిరే సమయంలో అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతూ గట్టిగా కేకలు వేశాడు. ముత్యాలరావుతోపాటు గ్రామస్తులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే నీళ్లలో మునిగిపోవడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడు అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టీ యయాతీ రాజు తెలిపారు.

ఇంటిపై పిడుగుపాటు

రూ.లక్ష ఆస్తి నష్టం



పిడుగుపాటుతో పెచ్చులూడిన స్లాబు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో అర్ధరాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతు కూకటి వెంకన్నబాబు ఇంటి భవనంపై పిడుగు పడింది. దీంతో స్లాబ్ పెచ్చులు ఊడిపోగా, ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, స్విచ్ బోర్డులు, ఫ్యాన్లతోపాటు విద్యుత్ మీటర్ కాలిపోయాయి. సుమారు రూ. లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కాగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆర్‌ఐ కృష్ణ గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు.

హైదరాబాద్‌లో అశ్వారావుపేట వాసి మృతి



పంబి శ్రావణ్(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన పంబి శ్రావణ్(30) భార్య సోనితో కలిసి మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, శ్రావణ్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి తండ్రి అశ్వారావుపేటలో పంచాయతీ రాజ్ శాఖలో అంటెడర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

ఇద్దరిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: బ్యాంక్ రుణం పేరుతో మహిళను మోసం చేసిన ఇద్దరిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టీ యయాతీ రాజు కథనం ప్రకారం.. పట్టణంలోని నందమూరినగర్‌కు చెందిన హలీమాకు ప్రైవేటు బ్యాంక్‌లో రూ. 7 లక్షల రుణం ఇప్పిస్తామని అశ్వారావుపేటకు చెందిన పీ ఫణీంద్ర, అతని తండ్రి రామస్వామి బాధితురాలి సంతకాలతో ఖాళీ చెక్కులు తీసుకున్నారు. ఆ తర్వాత హలీమా బ్యాంక్ అకౌంట్‌లో పడిన నగదు నుంచి రూ. 2 లక్షలు కాజేసి, విడతల వారీగా వస్తాయని నమ్మించారు. తిరిగి నగదు జమ కాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.